క్లుప్తంగా

తల్లిలేని పిల్లలకు ఆర్థికసాయం



ఆర్థిక సాయం చేస్తున్న సర్పంచ్ నిమ్మక గణేష్, సచివాలయ కన్వీనర్లు

జియ్యమ్మవలస: మండలంలోని కొండచిలకాం పంచాయతీ ద్రాక్షణి గ్రామానికి చెందిన నిమ్మక జ్యోతి అనారోగ్యంతో మరణించింది. దీంతో ఇద్దరు పిల్లల పోషణకు భర్త నాగేశ్వరరావు ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ నిమ్మక గణేష్‌తో పాటు సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు రూ.6 వేలు నగదుతో పాటు రెండు క్వింటాళ్ల బియ్యం బుధవారం అందజేశారు. ప్రభుత్వం, దాతలు ఆ కుటుంబానికి అండగా నిలవాలని కోరుతున్నారు.

గోపాలపురంలో వైఎస్సార్ కంటివెలుగు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పాలకొండ: మండలంలోని గోపాలపురం గ్రామంలో బుధవారం వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 60 ఏళ్లు దాటిన వారికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో కంటి వైద్యనిపుణులు టి.కృష్ణారావు ఆధ్వర్యంలో 62 మందికి పరీక్షలు చేసి 32 మందికి కళ్లద్దాలకు, 16 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసి, కళ్లద్దాలు అందజేయనున్నట్లు చెప్పారు. వైద్య సిబ్బంది ప్రియాంక, ఎస్.హైమావతి, ఆర్.శ్రీనివాసరావు శిబిరంలో సేవలందించారు.

మస్తర్ల నమోదులో తప్పులు చేయొద్దు



ఉపాధి పనుల మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

భామిని: ఉపాధిహామీ పనులకు వచ్చే వేతనదారుల మస్తర్ల నమోదులో తప్పులు ఉండరాదని ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు అన్నారు. బాలేరులో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఎండలు పెరుగుతున్నందున పని ప్రదేశంలో తాగునీరు, నీడ ఏర్పాటు చేయాలన్నారు. మస్తర్లలో దిద్దుబాటు వద్దన్నారు. ఉదయం, సాయంత్ర సమయాల్లో పనులు చేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

సచివాలయ సేవలు మెరుగుపడాలి

భామిని: మండలంలోని ఘనసర, నల్లరాయిగూడ, లివిరి గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు బుధవారం సందర్శించారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని, మెరుగైన సేవలందించేందుకు కృషిచేయాలన్నారు.

నేటి నుంచి సమ్మేటివ్-2 పరీక్షలు



ప్రశ్నపత్రాలు సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు

వీరఘట్టం: 1వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు గురువారం నుంచి సమ్మేటివ్-2 పరీక్షలు ప్రారంభం కానున్నాయని ఎంఈఓ పట్రి కృష్ణమూర్తి తెలిపారు. ఓ.ఎం.ఆర్ షీట్లు, ప్రశ్నపత్రాలు మండల విద్యాశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. అన్ని పాఠశాలల హెచ్ఎంలు ఎంఈఓ కార్యాలయానికి వచ్చి ఏరోజు పశ్నపత్రాలను ఆరోజు తీసుకువెళ్లాలని కోరారు.

23న తాడికొండలో వైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ గ్రామంలో ఈనెల 23న రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ మంచుపల్లి శ్రీరామ్మూర్తి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరంలో నిపుణులైన జనరల్, కంటి, చర్మవ్యాధులు, ఎముకలకు సంబంధించి వైద్య నిపుణులు వైద్య సేవలందిస్తారన్నారు. వైద్య శిబిరంతో పాటు ఎంపిక చేసిన 100 నిరుపేద గిరిజన కుటుంబాలకు వంట పాత్రలు, వ్యక్తిగత పరిశుభ్రత సామగ్రి పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ వైద్య శిబిరాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జియ్యమ్మవలస: పెదమేరంగిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాలకొండ: 1వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు

సంక్షేమ సారథి సీఎం జగన్

సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సుపరిపాలన సాధ్యమవుతుందని ప్రజలు నమ్ముతున్నారు. మా నమ్మకం నువ్వే జగన్ అంటూ ముఖ్యమంత్రి ఫొటోతో కూడిన స్టిక్కర్లను తమ ఇంటి గోడలకు అతికించి ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం పలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు ఎలా ఉందని అడగగా.. ప్రతి ఒక్కరూ బాగుందని బదులిచ్చారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ తమ జీవితాల్లో సంతోషాలు నింపిన నాయకుడిగా కీర్తిస్తున్నారు. - సాక్షి నెట్‌వర్క్



వీరఘట్టం: చిట్టపులివలసలో ప్రభుత్వ సంక్షేమ కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు



భామిని: లివిరిలలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీటీసీ ఉష, సొసైటీ చైర్మన్ రమేష్, తదితరులు



భామిని: గురండిలో ప్రచారంలో పాల్గొన్న శివ్వాల తిరుపతి, సర్పంచ్ బైరాగీ తదితరులు



పాలకొండరూరల్: సింగుపురంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వీరఘట్టం: బీసీ కాలనీలో ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ మంతిని హేమలత, బొమ్మాళి హేమలత, సచివాలయ కన్వీనర్లు

'మిషన్ వాత్సల్య' దరఖాస్తుల స్వీకరణకు కొర్రీలు

వీరఘట్టం: తల్లిదండ్రులు లేని 19 ఏళ్లలోపు వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు నెలకు రూ.4 వేలు చొప్పున అందించనున్నారు. అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కూడా ఆహ్వానిస్తోంది. అయితే ఇటీవల కేజీబీవీలో, సంక్షేమ వసతి గృహాల్లో 10వ తరగతి పూర్తిచేసిన కొందరు విద్యార్థులు ఈ పథకానికి దరఖాస్తు చేయగా.. అధికారులు వారి దరఖాస్తులను తిరస్కరించడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతవరకు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీల్లో చదివినప్పటికీ ప్రస్తుతం తాము నిరాశ్రయులుగా ఉన్నామని, తమ పరిస్థితిని అర్థం చేసుకుని వాత్సల్య పథకానికి తమ దరఖాస్తులు స్వీకరించాలని వారంతా కోరుతున్నారు. ఈ విషయాన్ని సాక్షి విలేకరి జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు వెంటనే స్పందించి 32 మంది దరఖాస్తులను స్వీకరించేందుకు అంగీకరించారు. వెంటనే వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు వీరఘట్టం మండలంలో 413 మంది దరఖాస్తులు ఆన్‌లైన్ చేసినట్లు సీడీపీఓ పూర్ణిమ తెలిపారు

ట్యాంకులతో తాగునీరు సరఫరా



బార్నాలవీధిలో ట్యాంకు వద్ద నీరు పడుతున్న మహిళలు

వీరఘట్టం: స్థానిక మేజరు పంచాయతీలో రక్షిత మంచినీటి పైపులైను మరమ్మతులకు గురికావడంతో అన్ని వీధులకు ట్యాంకుల ద్వారా తాగునీరు సరాఫరా చేస్తున్నామని ఈఓ వి.రామచంద్రరరావు తెలిపారు. పైపులైను బాగు చేసేందుకు కావాల్సిన సామగ్రి విజయవాడ నుంచి రావాల్సి ఉందని, సామగ్రి వచ్చిన వెంటనే మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. అంతవరకు ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేస్తామన్నారు. అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

చిరుధాన్యాల పంటల పరిశీలన



కొర్రపంటను పరిశీలిస్తున్న డీపీఎం, ఏడీఏ తదితరులు

సీతంపేట: మండలంలోని పెదరామ పంచాయతీ కారెం చింతలగూడలో రైతులు సాగు చేస్తున్న చిరుధాన్యాల పంటలను ప్రకృతి వ్యవసాయం జిల్లా డీపీఎం షణ్ముఖరాజు, ఏడీఏ రత్నకుమారి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. చిరుధాన్యాల సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎంటీ బాలు, ఐబీఎంటీ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సిరిమాను చెట్టుకు పూజలు



సిరిమాను చెట్టు వద్ద పూజలు చేస్తున్న బోయిడు, కమిటీ సభ్యులు

వీరఘట్టం: ఈ నెల 30 నుంచి మే 10వ తేదీ వరకు జరగనున్న వీరఘట్టం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఉత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ప్రధానమైన ఘట్టం సిరిమాను మహోత్సవం, అంజలి రథం. సిరిమాను చెట్టుకు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. బోయిడు అమ్మవారి దండకాన్ని చదివాడు. ఆచారం ప్రకారం చెట్టు మొదలు వద్ద అమ్మవారి సేవకులు పూజలు జరిపిన తర్వాత ఆ చెట్టును కొట్టి అమ్మవారి ఆలయానికి తరలించారు. అలాగే అంజలి రథం కోసం మర్రి చెట్టును, ఉజ్జిడిబండి కోసం చింతచెట్టును సిద్ధం చేశారు.

ఆశ్రమ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలి

● ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఆశ్రమ పాఠశాలల్లో వివిధ తరగతుల్లో అడ్మిషన్లు పెంచాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అన్నారు. ఐటీడీఏలో బుధవారం విద్యాశాఖాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో బోధన సక్రమంగా జరగాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన, పౌష్టికాహారం అందివ్వాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లు నిరుపేద విద్యార్థులకు కేటాయించేలా చూడాలన్నారు. శ్రీకాకుళం వైటీసీలో కొనసాగుతున్న సూపర్ 60 బ్యాచ్ కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల డేటాను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్, గిరిజన సంక్షేమశాఖ డీడీ నగేష్, ఓఎస్డీ యుగంధర్, గురుకులం సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయపార్వతీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉజ్జీవ క్రైస్తవ సభలు



ఉజ్జీవ మహా సభలో ప్రార్థనలు చేస్తున్న క్రీస్తు విశ్వాసకులు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట అసెంబ్లీ చర్చిలో మూడు రోజులుగా జరుగుతున్న ఉజ్జీవ క్రైస్తవ మహాసభలు బుధవారం సాయంత్రం ముగిశాయి. ఈ మేరకు చర్చి గాస్పల్ బ్రదర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బ్రదర్ జార్జ్ మాథ్యూస్ మాట్లాడుతూ సర్వ మానవ సోదర భావాన్ని చాటే క్రీస్తు ప్రేమ సందేశాన్ని వినిపించే వేదికగా ఉజ్జీవ సభలు నిలిచాయన్నారు. గాస్పల్ బ్రదర్ మాట్లాడుతూ లచ్చయ్యపేట చర్చి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉజ్జీవ మహసభలు స్థానిక సంఘ కాపరి,విశ్వాసులు, గ్రామ పెద్దలు, సంఘ పెద్దలు, స్థానిక సంఘ సభ్యుడు బాబ్జీ పరస్పర సహకారంతో ఘనంగా జరిగాయన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సర్వేశ్వరరావు

పాలకొండ రూరల్: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన అవసరమని అగ్నిమాపక అధికారి జె.సర్వేశ్వరరావు అన్నారు. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలన్నారు. స్థానిక ప్రవేటు ఆస్పత్రుల్లో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. విద్యుత్ గృహోపకరణాలు, గ్యాస్‌స్టౌ వినియోగం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

నేడు పెదరామలో 'గడపగడపకు..'

సీతంపేట: మండలంలోని పెదరామ గ్రామసచివాలయం పరిధిలో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ కె.సత్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

వైద్య సేవలు అందిచడం ఓ వరం

● వైద్యాధికారి శ్రీకాంత్



వెంకంపేట గ్రామంలో వైద్యశిబిరం

పార్వతీపురంటౌన్: గ్రామాల్లో వైద్య సేవలు అందిచడం ఓ వరమని వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని పెంకంపేట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలకు మంచి స్పందన వస్తోందన్నారు. వైద్యశిబిరంలో అన్ని రకాల వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. అందుబాటులో 62రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు మందులను అందజేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న రోగుల వద్దకు వెళ్లి వైద్యసేవలను అందిస్తున్నామని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో రోగులను కుటుంబసభ్యుల్లా చూస్తున్నామని, రోగాల బారినపడి గ్రామాల్లో ఏ ఒక్కరూ ఉండకూడదనే ఉద్దేశంతో నిబద్ధతతో విధులను నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు ఉన్న వారు ఈ వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

ప్రైవేట్ వద్దు.. ప్రభుత్వ కళాశాలే ముద్దు

పార్వతీపురం టౌన్: ప్రైవేట్ కళాశాలలు వద్దు.. ప్రభుత్వ కళాశాలలే ముద్దు అని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో, మండలంలో అడ్మిషన్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం పట్టణం, చుట్టుపక్కల గ్రామాలలో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను కళాశాల జూనియర్ లెక్చరర్లు కలిసి కళాశాలలోని సదుపాయాలు, సౌకర్యాలు, బోధన-అభ్యసన కార్యక్రమాల గురించి వివరించామని తెలియజేశారు. ఉచిత పుస్తకాల సరఫరా, అమ్మఒడి పథకం, నాడు నేడు కార్యక్రమం ద్వారా కళాశాల ఆధునికీకరణ, డిజిటల్ బోధన మొదలైన వాటి గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నట్లు చెప్పారు. క్యూఆర్ కోడ్ కలిగి ఉన్న కరపత్రాలను పంచి పెడుతూ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి కళాశాలలోని సదుపాయాలు సౌకర్యాలను ఫొటోల రూపంలో చూడవచ్చని విద్యార్థులు, తల్లిదండ్రులకు వివరించామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే కళావతి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

సీతంపేట: శ్రీకాకుళం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు బుధవారం ఆ జిల్లాకు విచ్చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న ప్రధాన సమ్యలతో పాటు చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలో క్యాన్సర్ రోగులకు సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందించాలని కోరానన్నారు. అలాగే కనెక్టవిటీ రహదారులు, తాగునీటి సమస్యల పరిష్కారంతో పాటు మరికొన్ని సమస్యలు సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

నాణ్యతలో రాజీపడొద్దు



నాడు-నేడు పనులపై అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

● సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

పాలకొండ: నాడు-నేడు పనులు నాణ్యతతో చేపట్టాలని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ ఆదేశించారు. పట్టణంలోని పెదకాపువీధి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను బుధవారం పరిశీలించారు. నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా పనులు చేపట్టాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టడం ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు.

మోదీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం..



గుమ్మలక్ష్మీపురం: కరపత్రాలు పంచుతున్న సీపీఎం, సీపీఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం.. దేశాన్ని మతోన్మాద శక్తుల నుంచి కాపాడుకుందామని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. గుమ్మలక్ష్మీపురంలో సీపీఎం ప్రచారభేరి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ నెల 25న మండల కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ, మండంగి శ్రీనివాసరావు, తోట జీవన్న, గురుగుబిల్లి సూరయ్య, ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు విడనాడాలి

కురుపాం: కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఎం జిల్లా నాయకులు కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలను ఖండిస్తూ మండలంలోని బేరి దురిబిలి, తెన్నుఖేర్జ గ్రామాల్లో బుధవారం ప్రచారభేరి నిర్వహించారు. కేంద్రం ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు చూస్తోందని, కార్మికుల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మండాలి శ్రీను, ఎం.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



పాదచారులకు మజ్జిగ అందిస్తున్న విశ్వేశ్వరరావు, తదితరులు

పాలకొండ రూరల్: మండలంలోని అంపిలి మీదుగా బూర్జ మండలం అల్లెన గ్రామానికి వెళ్లే రహదరిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్ బుధ వారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధి వేతనదారులకు, పాదచారులకు మజ్జిగ అందించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి శశి, వలంటీర్లు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో..



గుమ్మలక్ష్మీపురం: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ గౌరీశంకరరావు

గుమ్మలక్ష్మీపురం: వివిధ పనులపై మండల కేంద్రానికి వచ్చేవారి దాహార్తి తీర్చేందుకు స్థానిక మహాత్మా గాంధీ విగ్రహం వద్ద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు బుధవారం ప్రారంభించారు. పలువురు బాటసారులకు తాగునీరు అందజేశారు. వేసవి పూర్తయ్యే వరకు చలివేంద్రం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, వీఆర్వో బోడమ్మ, వైస్ సర్పంచ్ కిషోర్, మాజీ సర్పంచ్ ప్రేమానంద్ పాల్గొన్నారు.